




**-10-**

# మాదయ్యగారి మల్లన యొక్క రాజశేఖరచరిత్ర

మాదయ్యగారి మల్లన, శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానములోని కవులలో ఒకరు. ఆనాడు మల్లన్న యని మరొక కవిపండితుడు ఉండేవాడుట. అందుకే ఈయనని వీరి తండ్రిగారి పేరుతో కలిపి పిలిచేవారు. కాబట్టి ఈయనకు మాదయ్యగారి మల్లన్న అన్న పేరు నిలబడిపోయింది. ఈతను శైవ బ్రాహ్మణుడు. ఈయన రాయలు ఆస్థాన అష్టదిగ్గజాలలో ఒకరు. రాయలు వారు దండయాత్రకు వెళ్ళినా, తీర్థయాత్రకు వెళ్ళినా వెంట వెళ్ళే కవులలో మాదయ్యగారి మల్లన్న ఒకరు.

ఈయన రాసిన రాజశేఖర చరిత్రము ప్రసిద్ధి చెందిన కావ్యము. ఈ రాజశేఖర చరిత్రము మొత్తము 516 గద్యపద్యాల కావ్యము. ఈ కావ్యము ఇంత చిన్నదైనా, మన తెలుగు సాహిత్యములో దీనికొక ప్రత్యేక స్థానం ఉన్నది. ఈ రచన మల్లన్నగారికి శాశ్వతమైన కీర్తి తెచ్చిపెట్టింది. ఇందులో కథ ఏ పురాణాల నుంచి తీసుకున్నది కాదు. పూర్తిగా కవి తన ఊహలతో నిర్మించినది. పైపెచ్చు ఇది నాదెండ్ల అప్పమంత్రికి అంకితం ఇవ్వబడినది. కారణము, ఇది మాదయ్యగారి మల్లన రాయలు ఆస్థానానికి రాక పూర్వము రచించినది. ఈ అప్పమంత్రి, తిమ్మరుసు అల్లుడు. ఈయన ఆనాడు ఒక పరగణా అధిపతిగా ఉండెనట. అలా మాదయ్యగారి మల్లనకు పరిచయమై, మల్లన రాయలు వద్దకు వచ్చి ఉండవచ్చని తన 'సమగ్ర ఆంధ్రసాహిత్యము'లో ఆరుద్ర అభిప్రాయపడ్డారు.

ఈ కావ్యములో కథ స్వతంత్ర కథ. ఈ కథ అనంతరపు కావ్యాలకు అంకురార్పణ చేసింది. టూకీగా ఒక కథానాయకుడు ఒక సుందరిని చూచి మోహించటము, ఇద్దరూ విరహం అనుభవించటము, పెద్దలు వివాహము జరిపించటము ఇందులో కథావస్తువు. నేటికీ కథలు అదే బాణిలో నడవటము మనము గమనించవచ్చు.

మాదయ్యగారి మల్లన రసహృదయాలు ఆనంద డోలికలలో తేలియాడే విధముగా ఈ ప్రబంధము రచించాడు. ఆయన తన కావ్యములో తన గురించి కూడా ఎక్కువ వివరాలు ఇవ్వలేదు.

అయ్యంకిపురం అగ్రహారమని చెప్పినాడు. అది కృష్ణాజిల్లాలో ఉన్నది. ఆయనకు కడప జిల్లాలోని పుష్పగిరిలో అఘోరశివాచార్యులన్న గురువు ఉండేవాడు.

రాజశేఖర చరిత్రలో గురువు గురించి ఇలా వివరించాడు

“సరసాహారము లింటబెట్టి బహుశిష్యశ్రేణికిం దెల్పు శా
స్త్ర రహస్యస్థితి చెప్పు నధ్యయనసంధ్యల్ హవ్యకవ్యంబులన్
సురకోటింబితృకోటి నేమరక ప్రోచున్ విప్రవర్గంబులో
సరిలే రెచ్చట నమ్మహాత్మకునకున్ సౌజన్యభవ్యోన్నతిన్” రాజ.8–11

‘రాజశేఖర చరిత్ర’లో అవంచిక అన్న నగరము ఒకటి ఉంటుంది. ఆ దేశం సస్యశ్యామలంగా ఉన్నది. పుష్కలంగా ధాన్యరాసులు ఉన్నవి. ఆ ఊరు గొప్పతనం చెప్పాలంటే మాటలు చాలవట.

“అన్నగరి చిరత ఏనుగ
గున్నలపై నెక్కి నిక్కి కోయగవచ్చున్
మిన్నేటి పసిడి తామర
లన్నన్ మరి ఏమి చెప్పనందలి కరులన్?” రాజ 1–51

దేశం వర్ధిలుతోంది పాడి పంటలతో. దేనికీ కొరత లేదు. కానీ రాజుకు విచారము. ఆయనకు పిల్లలులేరు.

ఆ రాజు కొక ఆలోచన తట్టింది ఒకనాడు.

“నీలకంఠుని శిరస్సుపై నీళ్లు చల్లి
పత్తిరి సుమంత యెవ్వడు పారవైచు
గామధేనువు వానింట గాడి పసర
మల్ల సురశాఖి వానింట మల్లెచెట్టు.” రాజ. 1–65

యధాలాపంగా నీరు పోసి పత్రి చల్లిన పలికెడు దైవం శివుడు. భక్తితో ఆరాధిస్తే ఆయన తప్పక తన కష్టం తీరుస్తాడని రాజు తలిచాడు. ప్రజలను కూడా శివుణ్ణి పూజించమని ప్రకటించాడు.

"ఎచ్చట జూచినం బ్రమధహిండితచండనిశాతవర్తనం
బెచ్చట జూచినన్ గుహగణేశ్వరభవ్యగుణానువాదనం
బెచ్చట జూచినన్ శివసమాహిత పుణ్యకథానుకీర్తినం
బచ్చుపడంగ జేసెనత డాదిమశైవకులాగ్రగణ్యుడై" రాజ.1-70

ఇలా శివుడ్ని కొలవగా ఒకనాడు రాజుకు కల ఫలించినది. రాణి కడుపు పండినది. పుట్టిన బిడ్డకు రాజశేఖరుడనే పేరు పెట్టారు. ఆ రాజ కుమారుడు పెరుగుతున్నాడు మహోజ్వలంగా. ఒకనాడు ఒక ముని వచ్చాడు రాజు కొలువుకు. రాజు సహాయము అడిగినాడు. ముని కుమార్తెను ఒక రాక్షసుడు ఎత్తుకుపోయినాడు. రాక్షసుని కూతురుకి సేవ చెయ్యటానకి నరపాపలను తీసుకుపోతున్నాడా రాక్షసుడు.

రాజశేఖరుడు ఆ ముని పాపను విడిపించటానికి పోతాడు. రాక్షసుడు "బెబ్బులి మీద చీంబోతా" అని గర్విస్తాడు కాని రాజశేఖరుని దెబ్బకు భయపడి పరుగున కాళీ మందిరములో దాగి అమ్మవారిని శరణు వేడుతాడు.

రాజశేఖరుడు ఆ రాక్షసుడిని వెంటాడి పట్టుకొని చంపబోతుండగా కాళికాదేవి ప్రత్యక్షమవుతుంది.

"కొప్పుపై నొప్పెడు కొదమ చంద్రునితోడ గస్తూరికాతిలకంబు తాడ
సీమంత విరచిత సిందూర రుచితోడ గ్రొత్తముత్తి యపు జేర్పుక్క తోడ
దళతళమను దంత తాటంకంకణమ్ములతోడ జిలుగైన చెంగావివలువతోడ

ముద్దుమోమున లేనవ్వు మొలకతోడ
జల్లచూపుల కరుణారసంబుతోడ
శాంత రూపంబు గైకొన్న శంభురాణి
యమ్మహాకాళి ప్రత్యక్షమయ్యెనపుడు" రాజ.2-88

ఆమె పరమ శాంతముగా ఉంది. ఆమెను ఒక దండకముతో స్తుతించాడు రాజకుమారుడు. అమ్మవారు రాక్షసుణ్ణి మన్నించమని చెప్పి ఒక మణిని బహుమతినిచ్చి మాయమవుతుంది. తరువాత ఒక యోగిని వచ్చి ఒక చిలుక నిచ్చింది.

ముని కుమార్తెను రక్షించి, ఆమె తల్లితండ్రులకు అప్పచెప్పి రాజకుమారుడు ఎంతో దూరం వెడతాడు. ఒక చోట అతనికి ఆకలి వేసింది. మణిని తలుచుకుంటే పిండివంటలూ వచ్చాయి.

"కలమాన్నంబు ఘృతంబు బాయసం  శాకవ్రాతముల్ పిండి వం
టలు పాల్దేనియ జున్ను వెన్న యిడియానా లుక్కెరల్ చక్కరల్
ఫలముల్ పాకముల్ రసాయనము లంబ ళ్లూరుబిం డ్లూరుగా
యలు బజ్జల్ దధిపిండఖండములు నందావిర్భవించెం దగన్" రాజ. 2-127

వంటకములన్నీ నేటికీ మార్పులేదు అని అనిపిస్తుంది మనకు ఇది చదివితే.

వంటకాలే కాదు అవి వడ్డించే వారు కూడా వచ్చారుట ఆ మణి నుంచి.

రాజశేఖరుని మణి ఎంతో గొప్పది.

వారు అలా ఉండగా ఒక ఉద్యానవనములో ఒక అందగత్తె విహరిస్తూ కనపడుతుంది. ఆమే పూర్వజన్మ కథ చిలక చెబుతుంది.

పూర్వము ఇద్దరు బ్రహ్మలు ఉండేవారట. ఒకరు ధనవంతులు. ఒకరు పేదవారు. ఆ దరిద్రము దాటటానికి పేద బ్రాహ్మడు విష్ణువును మెప్పించాలని ఘోర తపస్సు చేస్తాడు. ఇతను తపస్సు చేస్తూ ఉన్న చోటికి కొందరు గంధర్వులు వస్తారు. అందులో ఇద్దరు కన్యలు పూలగుత్తి కోసం తగువులాడుకుంటారు. దగ్గరలో తపస్సు చేస్తున్న మునిని ఎవరు మరులుకొలుపుతారో వారు గొప్పవాళ్ళని అనుకుంటారు. ఈ కన్య వెళ్ళి ముక్కు మూసుకు కూర్చున్న బ్రహ్మణుడిని కదిపింది. ఆయన కళ్ళు తెరిచి మానవకాంతవు కమ్మని శపించాడు. ఆ కాంతనే ఈ రాజకుమారి అని చెప్పింది చిలుక.

మాదయ్యగారి కవిత్వములో కొన్ని నియమాలు ఉన్నవి.

"చెప్పదగు కవిత రసం ల్చిప్పిల నప్పప్ప బళిబళీ యనలేదా
యెప్పుడు చెప్పక యుండుట యొప్పు సుమీ సుకవియెంతయుచితజ్ఞుడొకో" అంటారాయన.

ఈ కావ్యములో వివాహపు తంతును విస్తారంగా వివరించాడాయన. ఆనాటి ఆచారవ్యవహారాలు తెలియటానికి అవి సహకరించాయి.

లగ్నం పెట్టింది లగాయతు గృహప్రవేశం దాకా జరిగిన తంతును 75 పద్యాలలో వివరించాడు.

పుస్తెలు, నల్లపూసలు ఐదవతనానికి చిహ్నాలుగా నేడు భావిస్తున్నాము. ఆ నల్ల పూసల ఆచారము ఆదిమకాలము నుంచి లేదు. కాకతీయ కాలములో పెళ్ళి తంతులో తలంబ్రాల వర్ణన యున్నది కాని నల్లపూసల ఊసులేదు.

రాజశేఖర చరిత్రలో మనకు అది కనపడుతుంది.

"సవిధకీర్ణపరాగాగ్ని సాక్షిగాగ - దమ్మి విందు కరగ్రహణమ్మునర్చ

బొలుచు పద్మినికిని నల్లపూసదండ - గట్టినాడన నెలదేటిగములు పొదలె".

రాజ.2-69

కథానాయకుని వివాహాన్ని వర్ణిస్తూ ఐరేని కుండలను, దంపతి తాంబూలాలను మాదయ్యగారి మల్లన పేర్కొన్నాడు. వధూవరులను మంచం మీద కూర్చోబెట్టి దంపతి తాంబూలాలు ఇప్పిస్తారు.

"మగువయునాథుడుం బసిడిమంచం పై వసియించి యెండొరుల్

మొగములు వంచి యొసరిలి సిగ్గుల గన్నుగోనలన్

నగవు దొలంక విప్రమిథునంబుల కిచ్చిరి దివ్య వాసనలన్

బుగులుకొనంగ జేసిన యపూర్వమనోహరవీటికావళుల్" రాజు". 3-180

సమకాలీన సమాజాన్నీ, ఆచారాలను చక్కగా ప్రతిబింబింప చేశాడు మాదయ్యగారి మల్లన.

ఆయన రచించిన ఈ కావ్యములో రాసినంతవరకూ వాస్తవికత ఉట్టిపడే సజీవ పాత్రలే. రాయలు వారి కొలువు చేరక ముందు రాశారు ఈ కావ్యమును. రాసినది చిన్న కావ్యమైనా చరిత్రలో నిలిచిపోయి మాదయ్యగారి మల్లనను చిరస్మరణీయులుగా చేసింది.

Ref

సమగ్ర ఆంధ్ర సాహిత్యము — ఆరుద్ర.

COMMENTS